సాక్షి శ్రీకాకుళం
మంగళవారం । 18 । మార్చి । 2025



ఉరుకులు.. పరుగులు

టెన్త్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. విద్యార్థులు ఉరుకులు పరుగులు పెట్టారు. - 8లో



కాశీబుగ్గలో భారీ చోరీ

కాశీబుగ్గలో భారీ చోరీ జరిగింది. పన్నెండు తులాల బంగారం, నగదు దోచుకున్నారు. - 8లో

రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
మంగళ (సా)	బుధ (ఉ)
6.09	4.45

న్యూస్‌రీల్

184 వినతుల స్వీకరణ

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదికలో కలెక్టర్ జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలిసి అర్జీలు స్వీకరించారు. మొత్తం 184 అర్జీలు స్వీకరించారు. వినతుల్లో కొన్ని..

- ఇంజినీరింగ్ పరీక్షలు ఈనెల 20వ తేదీ నుంచి జరగనున్నాయని, అయితే ఫీజు చెల్లించలేదని కళాశాల యాజమాన్యం హాల్ టిక్కెట్ ఇవ్వడం లేదని, ప్రభుత్వం చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకపోవడంతో పరీక్షలు రాయలేకపోతున్నామని, కళాశాల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ విద్యార్థి పి. శ్రీనివాసరావు కోరాడు.
- విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగుల దీర్ఘకాలిక పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలని స్టేట్ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్, శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు కె.సోమ సుందర రావు, జనరల్ సెక్రటరీ పీఎస్ ప్రసాద రావు, స్టేట్ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయీస్ జేఏసీ చైర్మన్ చౌదరి పురుషోత్తమనాయుడు కోరారు.
- ప్రభుత్వ స్థలాన్ని కొందరు ఆక్రమించారని గార మండలం శ్రీకూర్మం పంచాయతీకి చెందిన పలువురు గ్రీవెన్స్‌సెల్‌లో ఫిర్యాదు చేశారు. బస్టాండ్ వద్ద 15 సెంట్ల స్థలం ఆక్రమించి బోరు వేసి గోడలు కడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

పంచాయతీ హక్కులను కాలరాస్తున్నారు



కలెక్టర్‌కి వినతి పత్రాన్ని అందజేస్తున్న చింతాడ రవికుమార్

శ్రీకాకుళం పాతబస్టాండ్: గ్రామ పంచాయతీ తీర్మానాలతో సంబంధం లేకుండా మండల పరిషత్ అభివృద్ధి అధికారులు నేరుగా వెండర్ రిజిస్ట్రేషన్ చేయించి, జాతీయ ఉపాధి హామీ నిధులతో పనులు చేయిస్తున్నారని, ఇది నిబంధనలకు విరుద్ధమని వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస సమన్వయకర్త చింతాడ రవికుమార్ సోమవారం కలెక్టర్ గ్రీవెన్స్‌సెల్‌లో ఫిర్యాదు చేశారు. వెండర్ రిజిస్ట్రేషన్ విధానం కేవలం అధికార పార్టీకి అనుకూలంగా చేశారని ఆరోపించారు. ఉపాధి పనుల నిర్వహణకు ప్రత్యేకంగా చట్టం ఉందని గుర్తు చేశారు. పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం ఒక సంవత్సరంలో ఒక గ్రామ పంచాయతీకి వెచ్చించే మొత్తం ఖర్చులో కనీసం 50 శాతం పనులు పంచాయతీల ద్వారా చేపట్టాలని ఉత్తర్వులు ఉన్నాయని, దాన్ని ఈ పాలకులు ఆచరించడం లేదని విమర్శించారు. ఈ విధానాలపై విజయనగరం జిల్లా, రేగిడి ఆమదాలవలస మండలం, లక్ష్మీపురం, మునకలవలస, గుల్లపాడు గ్రామ పంచాయతీలు గత ఏడాది నవంబర్ నెల 26న రాష్ట్ర ఉన్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశాయని తెలిపారు. తుది తీర్పు ఈ ఏడాది ఫిబ్రవరి 5న వెలువడిందని, ఈ కోర్టు ఉత్తర్వులు ప్రకారం అభివృద్ధి పనులు మొత్తాన్ని గ్రామ పంచాయతీల ద్వారానే నిర్వహించాలని తెలిపిందని అన్నారు. ప్రస్తుతం పంచాయతీలు అన్నింటినీ వైఎస్సార్ సీపీ ప్రతినిధులు ఉన్నందున, ఆ అక్కసుతోనే కూటమి ప్రభుత్వం అలసత్వం చూపుతోందని తెలిపారు.

వినతి: అయ్యా మాకు కొత్త రేషన్ కార్డు కావాలి.

పరిష్కారం: ప్రస్తుతం ఆ ఆప్షన్ ప్రభుత్వం లాగిన్‌లో ఇవ్వలేదు. అనుమతి వచ్చిన వెంటనే మీ సమస్యను పరిష్కరిస్తాం.

సమస్య: అయ్యా.. నాకు పింఛన్ కావాలి.

పరిష్కారం: మీ వినతిని ఉన్నతాధికారులకు ఎండార్స్ చేశాం.

విన్నపానికి పరిష్కారానికి సంబంధం లేని వింత వైఖరి ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కనిపిస్తోంది. ఓ వైపు ప్రభుత్వం ప్రధాన సైట్లకు లాకులేసుకుని కూర్చుంది. మరోవైపు రేషన్, పింఛన్, ఇళ్లు వంటి వాటిపై పరిష్కారం చూపించే అధికారాన్ని అధికారులకు ఇవ్వకుండా లాగేసుకుంది. ఇంకోవైపేమో ప్రజల వినతులు పరిష్కరించి తీరాలని బదాయి పోతోంది. దీంతో అధికారులు కేవలం 'ఎండార్స్' మాత్రమే చేయగలుగుతున్నారు. దాన్నే పరిష్కారంగా చూపిస్తున్నారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికను సాక్షి విజిట్ చేసింది. ఫిర్యాదుదారులతో మాట కలిపింది.

విన్నపాలు వేనవేలు ▶ మాట దాటని పరిష్కారాలు



కనికరించడం లేదు

నాకు 75 ఏళ్లు. లెప్రసీ వ్యాధి ఉంది. కళ్లు పూర్తిగా కనిపించవు. థంబ్, ఐరిష్‌లు కూడా పడటం లేదు. వికలాంగ పింఛన్ కోసం కాళ్లరిగేలా తిరుగుతున్నా.. ప్రభుత్వం కనికరించడంలేదు.

– ఎల్.కృష్ణారావు, ఊసవానిపేట, ఆమదాలవలస మండలం

ఎందుకీ పీజీఆర్ఎస్..



మాది పొందూరు మండలం కనిమెట్ట. మా నాన్న అప్పయ్య ఫ్రీడమ్ ఫైటర్ కావడంతో ఎచ్చెర్ల మండలం ముద్దాడలో 198/2 సర్వే నంబరులో ఐదెకరాల భూమిని ప్రభుత్వం ఇచ్చింది. ఆ భూమికి పక్కనే వేరే వాళ్లకు స్థలం ఇచ్చారు. సర్వే సిబ్బంది సరిగా కొలవక ఎకరా భూమిని వారికే అప్పజెప్పారు. వెబ్‌ల్యాండ్‌లో మా నాన్న పేరుతో ఐదెకరాలు చూపిస్తున్నా ఫిజికల్‌గా నాలుగే ఉంది. ఇప్పటికి ఐదారుసార్లు కలెక్టర్ పీజీఆర్ఎస్ (గ్రీవెన్స్)లో ఫిర్యాదు చేశా. చివరికి పీజీఆర్ఎస్ అండార్స్‌మెంట్‌లో హద్దులు చూసేందుకు వీలుపడలేదు అని నాకు పంపించారు. సమస్యలు తీర్చనప్పుడు మరెందుకుంది పీజీఆర్ఎస్.

– కేవీ నర్సింహం, రిటైర్డ్ ప్రిన్సిపాల్, కనిమెట్ట, పొందూరు మండలం

ప్రభుత్వ భూమి ఆక్రమణ

లావేరు మండలంలోని తామాడ గ్రామంలో సర్వే నంబరు 105, 113లో 1, 2, 3, 7 సర్వే నంబర్లలో గల సుమారు 4 నుంచి 5 ఎకరాల ప్రభుత్వ భూమిని ముళ్ల సాయి అనే వ్యక్తి ఆక్రమించుకుని చదును చేసేశారు. ఇక్కడ రెవెన్యూ యంత్రాంగం చోద్యం చూస్తుందే తప్ప ప్రశ్నించడం లేదు. ఈ భూమిలోనే చిన్న గెడ్డ కూడా ఉంది. ఆక్రమణ వల్ల గెడ్డ మూసివేతకు గురైంది. తక్షణమే అధికారులు, రెవెన్యూ యంత్రాంగం స్పందించి ఆక్రమించుకున్న ప్రభుత్వ భూమిని తిరిగి స్వాధీనం చేసుకోవాలి.

– రౌతు నారాయణరావు, లావేరు మండలం, తామాడ గ్రామం

పెన్షన్ కోసం..



నా వయసు 55. నాకు ఇద్దరు ఆడపిల్లలు. ఒకమ్మాయికి పెళ్లి అయిపోయింది. మరో అమ్మాయి డిగ్రీ చదువుతోంది. నాకు ప్రమాదం జరిగి 6 నెలలు అవుతోంది. ప్రమాదంలో చెయ్యి, కాలు దెబ్బతిన్నాయి. ఎక్కడికీ వెళ్లి పనిచేయలేని పరిస్థితి నెలకొనడంతో కుటుంబ పోషణ భారంగా మారింది. పెన్షన్ కోసం ఊరిలో ప్రజాప్రతినిధులు, అధికారుల చుట్టూ తిరిగి విసిగి వేసారిపోయాను. గ్రీవెన్స్‌లో అయినా ఫిర్యాదు చేస్తే వికలాంగ పెన్షన్ మంజూరు చేస్తారనే ఆశతో వచ్చాను.

– ఎస్.అప్పారావు, రణస్థలం మండలం, సీతంవలస





గ్రీవెన్స్‌కు వచ్చిన అర్జీదారులు (ఇన్‌సెట్లో) కలెక్టర్‌కు తన సమస్యను వివరిస్తున్న మహిళ

- 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'కు వెల్లువెత్తుతున్న వినతులు
- అరకొరగానే సమస్యల పరిష్కారం
- రెవెన్యూ సర్వే శాఖల్లో ఎండార్స్‌మెంట్లకే పరిమితం
- దాన్నే పరిష్కారంగా చూపిస్తున్న వింత వైనం

శ్రీకాకుళం పాతబస్టాండ్/ శ్రీకాకుళం అర్బన్ / శ్రీకాకుళం క్రైం:

ప్రతి సోమవారం కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గ్రీవెన్స్‌సెల్ ప్రజల సమస్యలకు పరిష్కారం చూపలేకపోతోంది. దీంతో వచ్చిన వారే పదే పదే వినతులు పట్టుకుని ప్రతి వారం లైనులో నిలుచోవాల్సి వస్తోంది. పలు శాఖలకు సంబంధించి 2024 జూలై నుంచి ఇప్పటి వరకు 7,724 వినతులు వచ్చాయి. వీటిలో ఇప్పటి వరకు 6,555 సమస్యలు పరిష్కారం జరిగినట్టు అధికారులు రికార్డుల్లో చూపిస్తున్నారు. కానీ ఈ 'పరిష్కారం'పైనే బోలెడు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఫిర్యాదులు క్షేత్రస్థాయికి చేరే సరికి ఎండార్సుమెంట్‌తో సరిపెడుతున్నారు. పైగా దీన్నే పరిష్కారంగా చూపిస్తూ.. పైన పేర్కొన్నట్లు లెక్కలు చూపిస్తున్నారు.

సమస్య పరిష్కారమయ్యేదెలా..?

వాస్తవానికి పింఛను కావాలని ఒక వయోవృద్ధుడు వస్తే, ఆయనకు కలెక్టర్ పింఛను మంజూరు చేసేందుకు కూటమి ప్రభుత్వంలో అసలు అవకాశమే లేదు. సంబంధిత సైట్‌ను ప్రభుత్వం ఎప్పుడో మూసివేసింది. అలాగే ఇల్లు కావాలని, రేషన్ కార్డు కావాలని, లేదా ఉన్న కార్డు నుంచి తొలగిపోవాలన్నా, చేర్పించాలన్నా ప్రస్తుతం ఆ పనులేవీ జరిగే పరిస్థితి లేదు. దీనికి ప్రభుత్వ విధానాలే కారణమని అధికారులు చెబుతున్నారు. దీంతో దీనికి సంబంధించిన వినతులన్నీ కేవలం పైకి ఎండార్స్ చేస్తూ ఫిర్యాదుదారులను సంతృప్తి పరిచే ప్రయత్నం చేస్తున్నారు.

అన్ని సైట్లు లాక్

కూటమి ప్రభుత్వం వచ్చాక సామాన్యుల సమస్యలు ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోయాయి. కొత్త ఇల్లు రావడం లేదు. పింఛన్లు కూడా కొత్తగా ఇవ్వడం లేదు. ఫీజు రీయింబర్స్‌మెంట్ జోలికిపోవడం లేదు. ఉన్న పింఛన్లు కూడా తీసేస్తున్నారు. అధికారులను అడిగితే 'అన్ని సైట్లు లాక్'అని సమాధానం చెబుతున్నారు. దీంతో ప్రజలు వినతి కాగితాలు చేతబట్టుకుని వారం వారం కలెక్టరేట్ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

ఆన్‌లైన్‌లో నమోదు..

కూటమి ప్రభుత్వం వచ్చాక అప్పటివరకు ఉన్న స్పందన పేరు మార్చి ప్రజా సమస్యల పరిష్కారవేదిక (పీజీఆర్ఎస్) పేరిట గ్రీవెన్స్‌సెల్ నిర్వహిస్తున్నారు. వీటిలో సుమారుగా 78 రకాల ఫిర్యాదులను ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు ఆప్షన్ ఇచ్చారు. **ఈ శాఖల నుంచి 2024 జూలై నుంచి ఇప్పటి వరకు 7724 వినతులు వచ్చాయి. వీటిలో ఇప్పటి వరకు 6555 సమస్యలు పరిష్కారం జరిగినట్టు అధికారులు రికార్డులు చూపిస్తున్నారు. అయితే క్షేత్ర స్థాయిలో మాత్రం ఈ సమస్యలు పరిష్కారం జరగడం లేదు.** కేవలం అధికారులు ఎండార్సుమెంటు ఇచ్చి వినతి దారుల సమస్యలను వాయిదా వేస్తున్నారు. ఎవరైనా ఇంటి కోసమో, రేషన్ కార్డు కోసమే, పట్టా డివిజన్‌కోసమో వస్తే 'ప్రస్తుతం ఆ ఆప్షన్ ప్రభుత్వం లాగిన్‌లో ఇవ్వలేదు. అనుమతి వచ్చిన వెంటనే మీ సమస్యను పరిష్కరిస్తాం' అని చెప్పి సమస్య పరిష్కారం అయినట్టు ఆన్‌లైన్ రికార్డుల్లో చూపిస్తున్నారు.

గ్రౌండ్ రిపోర్ట్ సాక్షి గ్రౌండ్ రిపోర్ట్

దీంతో సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించడం లేదు. దీంతో ప్రజలు మళ్లీ మళ్లీ గ్రీవెన్స్‌కు వస్తున్నారు. ఇలా వచ్చిన వినతులు దాదాపు 473 వరకు ఉన్నట్లు గుర్తించి వాటి కోసం ప్రత్యేక విభాగాన్ని కూడా ప్రారంభించారు. కొన్నింటికి ప్రభుత్వం అనుమతులు ఇవ్వకపోవడం, మరికొన్ని క్షేత్ర స్థాయి అధికారులు జాప్యం చేయడంతో పరిష్కారం లభించడం లేదు. భూ సమస్యలు, జిరాయితీని ప్రభుత్వ భూములుగా రికార్డు చేయడం, రీ సర్వేలో జాయింట్ ఎల్‌పీలు సరిచేయాలని ఫిర్యాదులు, రైతుల మధ్య గట్టు వివాదం, డి పట్టాలు సర్వే చేయకపోవడం వంటివాటిలో కొన్నింటిని పరిష్కరించే వీలున్నా.. ప్రభుత్వం చెబుతున్న ఇతర పనుల వల్ల వీటిని పరిష్కరించలేకపోతున్నామని అధికారులు చెబుతున్నారు.

కలెక్టర్‌కు విన్నవిద్దామని..



1975లో మా నాన్న కరిమిజ్జి అప్పన్న 39/19 సర్వే నంబరులో 8 సెంట్ల స్థలం కొన్నారు. నాలుగు సెంట్లలో ఇద్దరం అన్నదమ్ములం ఇళ్లు కట్టుకున్నాం. ఖాళీగా ఉన్న నాలుగు సెంట్ల స్థలాన్ని వీఆర్వో పిన్నింటి సింహాచలం నెలరోజుల కిందట వేరేవారికి (సోమినాయుడు సన్నాఫ్ చినరామునాయుడు పేరిట) పొజిషన్ సర్టిఫికెట్ ఇచ్చి మరీ రిజిస్ట్రేషన్ చేయించి మ్యుటేషన్ కూడా పెట్టేశాడు. అప్పటి డాక్యుమెంట్లు, ఇప్పటి రిజిస్ట్రేషన్ పత్రాలు మాకు ఉన్నాయి. కలెక్టర్‌కు విన్నవించుకుందామని వచ్చాం.

– కరిమిజ్జి కృష్ణ, దాలింరాజువలస, జి.సిగడాం మండలం

సమస్యలు పరిష్కరించాలి..

పొన్నాడ పంచాయతీ పరిధిలోని కొంగరాం గ్రామం వద్ద నిర్మించిన జగనన్న కాలనీ అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారుతోంది. ఇక్కడ సాయంత్రం అయితే సరి గంజాయి బ్యాచ్‌లు, మందుబాబుల వీరంగం అంతా, ఇంతా కాదు. జగనన్న కాలనీ వద్ద రోడ్డు ముందే మందుషాపు పెట్టారు. దీంతో మందుబాబులు పట్టపగలే ఇళ్ల వద్దకు వచ్చి చిందులు వేస్తున్నారు. ఇక్కడ ఇళ్లకు ఏర్పాటు చేసిన పైపులను, ఇంటిపై పెట్టిన వాటర్ ట్యాంక్‌లను దొంగతనం చేస్తున్నారు. ఇక్కడ ఉండేందుకు జనం ఇబ్బంది పడుతున్నారు. మా సమస్యలను పరిష్కరించాలి.

– కొంగరాం జగనన్న కాలనీ వాసులు



కొంగరాం జగనన్న కాలనీవాసులు



కేంద్ర మంత్రికి విన్నవించినా..

సొంత ఇల్లు లేక అవస్థలు పడుతున్నాం. కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడును కలసి ఇల్లు మంజూరు చేయాలని కోరడం జరిగింది. సానుకూలంగా స్పందించారు తప్ప పని జరగలేదు. శ్రీకాకుళం మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నాను. అయినప్పటికీ ఫలితం లేకపోయింది. ఇపుడు గ్రీవెన్స్‌కు వచ్చి మళ్లీ దరఖాస్తు చేస్తున్నాను.

– బరాటం స్వర్ణలత, శ్రీకాకుళం

నా పరిస్థితి ఏంటి?



ప్రమాదంలో నా రెండు కాళ్లు పోయాయి. పూర్తిగా చచ్చుబడ్డాయి. వికలాంగ పింఛన్ వస్తుందన్న ఆశతో ఇప్పటికి పలుమార్లు గ్రీవెన్స్‌కు వచ్చా. ఫలితం లేదు. ఏమంటే నా తండ్రికి ప్రభుత్వ ఉద్యోగమంటున్నారు. నా జీవనం పరిస్థితి ఏంటి? కూటమి ప్రభుత్వం ఇప్పటికైనా ఫించను ఇవ్వాలి.

– డి.రామ్‌కుమార్, హిరమండలం

ఆరుసార్లు ఫిర్యాదు చేశా..




1951లో 28 సెంట్లకు (సర్వే నెంబరు 49/10) రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ ఉంది. వెబ్‌ల్యాండ్‌లో మిస్సయిందని డాక్యుమెంట్లున్నా ఎస్ఎల్ఆర్‌లో ఎలా ఉంటే అలా పెట్టేశారు రెవెన్యూ వాళ్లు. ఇప్పటికి ఆరు సార్లు ఫిర్యాదు చేశా. పట్టించుకోవడం లేదు.

– అల్లు రమణమూర్తి, రామదాసుపేట, జలుమూరు మండలం

పట్టా కోసం..

28 ఏళ్ల కిందటి నుంచి మా తాత డోల రామ్మూర్తికి 12 సెంట్ల స్థలం ఉంది. ఇందులో డీపట్టా 7 సెంట్లు తహసీల్దార్ ఖాళీ చేయించి వేరే వారికి ఇచ్చేశారు. ఉన్న ఐదు సెంట్లు జిరాయితీ. అందులో రేకుల షెడ్డు ఉంది. దానికైనా పట్టా ఇస్తారని కలెక్టర్‌కు విన్నవించుకుందామని వచ్చా.

డోల రామ్మూర్తి పేరుతో ఫిర్యాదు చేసిన మనవడు, చెట్టు పొదిలాం, జి.సిగడాం మండలం



బయటకు గెంటేశారు..



నాకున్న పదెకరాలు ముగ్గురు కొడుకులు వారి పేరున రాయించుకున్నారు. కుమార్తెలు ఐదుగురున్నారు. వారికొక్కరికి ఇవ్వాల్సిన 20 సెంట్లూ ఉంచుకున్నారు. నేనా నడవలేని వృద్ధుడిని. ఇప్పుడు నా బాగోగులు సైతం పట్టించుకోక బయటకి గెంటేశారు. న్యాయం కోసం వచ్చా.

– హరిహరపాత్రో, దండుగోపాలపురం

అన్నన్నా.. అచ్చెన్నా..!

అసెంబ్లీ సాక్షిగా మంత్రి అచ్చెన్నాయుడు అబద్ధాలు

- వైఎస్ జగన్ హయాంలో నిర్మించిన కిడ్నీ ఆస్పత్రిపై అసత్యాలు
- మిషన్లు లేవు.. సిబ్బంది లేరంటూ విషం చిమ్మిన మంత్రి
- ఆస్పత్రిలో అందుబాటులో ఉన్న అధునాతన పరికరాలు
- అప్పట్లోనే 154 మందికి పైగా సిబ్బంది నియామకం

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

అసెంబ్లీ సాక్షిగా మంత్రి అచ్చెన్నాయుడు అబద్ధాలు చెప్పారు. పలాస కిడ్నీ రోగులకు ప్రాణం పోసిన వైఎస్ జగన్ ప్రభుత్వంపై విషం చిమ్మారు. కిడ్నీ రోగుల కోసం పలాసలో కేవలం ఆస్పత్రి భవనం మాత్రమే కట్టారంటూ అసత్యాలు పలికారు.

ఉద్దానంలోని ఇచ్ఛాపురం, కవిటి, సోంపేట, కంచిలి, మందస, పలాస, వజ్రపుకొత్తూరు మండలాలు కిడ్నీ వ్యాధి ప్రభావిత ప్రాంతాలు. ఇక్కడి బాధితులు వైద్యం కోసం వ్యయ ప్రయాసలకు గురై విశాఖ వెళ్తుండేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ఇక్కడ పరిస్థితుల్లో మార్పు వచ్చింది. ఉద్దానం కిడ్నీ రోగుల కోసం సుమారు రూ.85కోట్లతో డాక్టర్ వైఎస్సార్ కిడ్నీ రీసెర్చ్ కమ్ హాస్పిటల్ నిర్మించింది. వైద్య సేవలను అందుబాటులోకి తెచ్చేందుకు అధునాతన పరికరాలు సమకూర్చింది. దానితో పాటు ఉద్దానం ప్రాంత ప్రజలకు వైఎస్ఆర్ సుజలధార ప్రాజెక్టు ద్వారా ఆ ప్రాంతంలో ఉన్న ప్రజలకు తాగునీటి సదుపాయం కల్పించింది. కిడ్నీ రోగులకు అండగా నిలిచి వారికి ఉచిత వైద్యంతో పాటు ఉచితంగా మందులు, రవాణా సౌకర్యం అందుబాటులోకి తెచ్చింది.



పలాస కిడ్నీ ఆస్పత్రిలోని దయాలసిస్ వార్డు



పలాస కిడ్నీ ఆస్పత్రి

ఇంత చేస్తే మంత్రి అచ్చెన్నాయుడు అసెంబ్లీ సాక్షిగా పచ్చి అబద్ధాలు చెప్పారు. సిబ్బంది లేరు.. మిషనరీ లేదని పాత దయాలసిస్ మిషన్లు సీహెచ్‌సీ నుంచి తెప్పించి, ప్రారంభోత్సవం చేసేసి గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెళ్లిపోయారని గుక్క తిప్పకుండా బొంకారు. అసెంబ్లీ పలాస కిడ్నీ ఆస్పత్రిలో ఎంత మంది సిబ్బంది ఉన్నారో...ఎన్ని మిషన్లు ఉన్నాయో అచ్చెన్నాయుడుకు తెలుసో లేదో అని అక్కడి ప్రజలు అంటున్నారు.

ఆస్పత్రిలో ఉన్న మిషన్లు ఇవి..

దయాలసిస్ కోసం పలాస కిడ్నీ ఆస్పత్రిలో వైఎస్ జగన్ ప్రభుత్వం నెఫ్రోప్లస్‌కు చెందిన 19మిషన్లు పెట్టింది. అందులో నెగెటివ్ మిషన్లు 16, పాజిటివ్ మిషన్లు మూడు ఉన్నాయి. వీటితో పాటు సీటీ స్కాన్, ఆల్ట్రా సౌండ్ మిషన్, ఆటోమెటిక్ టిష్యూ ప్రొసెసర్, క్రయోస్టాట్, ఆటో మెటిక్ బయో కెమిస్ట్రీ ఎనలైజర్, సీ ఆర్మ్ మిషన్, 80 నుంచి 40 సెంటిగ్రేడ్ల డీప్ ఫ్రీజర్లు, ఈఎస్‌డబ్ల్యూ మిషన్, ఆటోమేటిక్ ఓటీ టేబుల్స్, హోల్మియం లేజర్, యూరో డైనమిక్ మిషన్లు రీసెర్చ్ ల్యాబొరేటరీలు, వెంటిలేటర్లతో పాటు 25 అత్యాధునిక కంప్యూటర్ ప్రింటర్లు అందుబాటులో ఉంచింది. గత ప్రభుత్వంలోనే అన్ని రకాల పోస్టులు కలిపి 154 భర్తీ చేసింది. అంతేకాకుండా మిగతా పోస్టులను భర్తీ చేసేందుకు నోటిఫికేషన్లు జారీ చేసింది. ఈ లోపు ఎన్నికల కోడ్ వచ్చేసింది.



సీటీ స్కాన్



ఆపరేషన్ థియేటర్



అత్యాధునిక పరికరాలు

టీడీపీ కార్యకర్త బరి తెగింపు

టెక్కలి: మండలంలోని గూడేం పంచాయతీ పిట్టల సరియా గ్రామంలో టీడీపీ కార్యకర్త బరితెగించాడు. తన పొలానికి రక్షణ కోసం విద్యుత్ స్తంభాలను వినియోగించడమే కాకుండా రోడ్డును ధ్వంసం చేయడంపై పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తా యి. ఒక వైపు ప్రభుత్వ రోడ్డును ధ్వంసం చేయడమే కాకుండా ప్రభుత్వానికి చెందిన విద్యుత్ స్తంభాలను దర్జాగా సొంత వినియోగానికి వాడుకోవడంపై స్థానికులు దుమ్మెత్తి పోస్తున్నారు.



పిట్టలసరియా గ్రామంలో రోడ్డును ధ్వంసం చేసి పొలానికి వేసుకున్న విద్యుత్ స్తంభాలు

కుంటిభద్రలో ఏనుగుల తిష్ట



కొత్తూరు: మండలంలోని కుంటిభద్ర గ్రామంలో సోమవారం ఏనుగుల గుంపు తిష్ట వేసింది. రాత్రి వంశధారలో నీటిని తాగుతూ పగలంతా అరటి, చెరుకు, మొక్కజొన్న పంటల్లో తిష్ట వేస్తున్నాయి. ఏనుగులను కవ్వించవద్దని తహసీల్దార్ రవిచంద్ర సూచించారు.

శ్రీకూర్మం పరిధిలో పులి కలకలం



గార: శ్రీకూర్మం, అంపోలు పంచాయతీల పరిధిలో పులి సంచరిస్తోందని పుకార్లు వెల్లువెత్తాయి. ఆదివారం ఉదయం శాలిహుండం పంచాయతీ పరిధి తంగుళ్లపేటలో చూశామని రైతులు తెలిపారు. దీంతో అటవీ శాఖ సిబ్బంది శాలిహుండం, సతివాడ పరిధిలో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. అదే సమయంలో పొలాలు, నీటి కాలువల వెంబడి పాదముద్రలు పరిశీలించారు. సోమవారం ఉదయం నుంచి శ్రీకూర్మం పంచాయతీ చల్లపేట, అంపోలు పంచాయతీ జెల్లపేట పరిధిలో పులి ఉందని పుకార్లు షికార్లు చేశాయి.

క్లుప్తంగా

క్యాంటిన్ కోసం టెండర్లు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో క్యాంటిన్ ప్రారంభం కోసం టెండర్లు పిలిచేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. విశ్వవిద్యాలయంలో గత కొన్నేళ్లుగా క్యాంటిన్ నిర్వహించడం లేదు. దీంతో అధ్యాపకులు, సిబ్బంది అల్పాహారం కోసం ఎచ్చెర్ల గ్రామంలోకి వెళ్తున్నారు. దీంతో క్యాంటిన్ నిర్వహిస్తే ఆదాయం వస్తుందని అధికారులు భావిస్తున్నారు. క్యాంటిన్ వల్ల వర్సిటీ వర్గాలకు అల్పాహారం, స్నాక్స్, ఇతర ఆహార పదార్థాలు అందుబాటులోకి వస్తాయి.

పేదల విద్యపై కక్ష తగదు

- వైఎస్సార్‌సీపీ కళింగ కుల రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణరావు



శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): పేదల విద్యపై కూటమి ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తోందని వైఎస్సార్‌సీపీ కళింగ కుల రాష్ట్ర అధ్యక్షుడు దుంపల లక్ష్మణరావు సోమవారం ఒక ప్రకటనలో ధ్వజమెత్తారు. పదిమంది లోపు విద్యార్థులు ఉండే ప్రాథమిక పాఠశాలలు మూసేవేయాలని నిర్ణయం తీసుకోవడం తగదన్నారు. పంచాయతీకి ఒక ప్రాథమిక పాఠశాల ఏర్పాటు చేస్తే, కొన్ని గ్రామాల్లో దాదాపు 5 కి.మీ దూరం వెళ్లాల్సిన పరిస్థితి ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులకు రవాణా సౌకర్యం కల్పిస్తామని నమ్మబలుకుతున్నారని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 3వ తరగతి నుంచే సబ్జెక్ట్ టీచర్స్‌ని ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. నాడు–నేడు పేరుతో కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దినట్లు తెలియజేశారు. అలాగే పేదలకు ఇంగ్లిష్ మీడియం విద్య అందడం సీఎం చంద్రబాబుకు ఇష్టం లేదని మండిపడ్డారు. ఇప్పటికే తల్లికి వందనం పథకానికి తక్కువ నిధులు కేటాయించి మోసం చేసేందుకు పూనుకున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ వైద్య కళాశాలలు 17కి గాను 7పూర్తి కాగా, మరో 10 కాలేజీలను ప్రైవేటుపరం చేయాలని కూటమి ప్రభుత్వం ఆలోచన చేయడం దారుణమన్నారు. ఇప్పటికైనా తీరు మార్చుకోకపోతే ప్రజాగ్రహం తప్పదని హెచ్చరించారు.

అంగన్‌వాడీలను సక్రమంగా నిర్వహించాలి



రంగోయి అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అప్పారావు

పలాస: అంగన్‌వాడీలను సక్రమంగా నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కె.అప్పారావు సూచించారు. మండలంలోని రంగోయి, పెంటిభద్ర అంగన్‌వాడీలు, బాలసదనం తదితర కేంద్రాలను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రాల్లో ఉన్న బాలింతలు, బాలలు, గర్భిణులతో మాట్లాడి అందుతున్న సదుపాయాలపై ఆరా తీశారు. కేంద్రాల్లో మౌలిక వసతులపై సంతృప్తి వ్యక్తం చేశారు. పెంటిభద్రలో శిథిలావస్థలో ఉన్న బావిని పూడ్చాలని ఎంఈవో శ్రీనివాసరావును ఆదేశించారు. ఆయనతో పాటు బాలల సంక్షేమ సమితి చైర్‌పర్సన్ యు.శ్రీలక్ష్మి, సభ్యుడు ఎం.గన్నప్పుడు, జిల్లా బాలల రక్షణాధికారి మెట్ట మల్లేశ్వరరావు, జీసీడీవో ఎస్.నీరజ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు యు.లత, ఎస్.సరస్వతీ, గంగమ్మ తదితరులు ఉన్నారు.

ఎస్పీ గ్రీవెన్స్‌కు 63 వినతులు



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైమ్ : ఎంతో దూరం నుంచి వ్యయ ప్రయాసలకోర్చి వచ్చే ప్రజల సమస్యల పట్ల పోలీసు అధికారులు ప్రాధాన్యతనివ్వాలని, చట్ట పరిధిలో విచారణ జరిపి పరిష్కరించాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల స్వీకరణ, పరిష్కారం కార్యక్రమంలో వచ్చిన 63 వినతులను ఎస్పీ క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం అధికారులకు పై విధంగా ఆదేశాలు జారీ చేస్తూ స్టేషన్‌లు చుట్టూ పలు మార్లు తిప్పించుకోవద్దని హితవు పలికారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

పొందూరు: చేనేత మహిళలు స్వయం శక్తితో ఆర్థికాభివృద్ధి సాధించాలని సిక్కోలు వీవర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ ముఖ్య కార్యనిర్వహణాధికారి బి.అప్పలనాయుడు ఆకాంక్షించారు. స్థానిక దేవాంగ సంఘ గ్రంథాలయంలో నాబార్డు ఆధ్వర్యంలోని ఆర్డ్స్ స్వచ్ఛంద సంస్థ సోమవారం ఏర్పాటు చేసిన మహిళా దినోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ సంస్థ చేనేత, రైతు మహిళలకు పెద్దపీట వేస్తోందన్నారు. తమ సంస్థలో చేనేత విభాగంలో 515 మంది సభ్యులు ఉన్నారని చెప్పారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రశంసలు పొందిన జల్లేపల్లి కాంతమ్మతో పాటు మరో 60 మంది చేనేత కార్మికులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆర్డ్స్ సంస్థ ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ కుప్పిలి పద్మ ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.



- మొదలైన పది పరీక్షలు

ఉరుకులు.. పరుగులు

- ప్రశాంతంగా పది పరీక్షలు ప్రారంభం
- జిల్లావ్యాప్తంగా 149 కేంద్రాల్లో పరీక్షలు
- తొలిరోజు 217 మంది గైర్హాజరు
- పరీక్ష కేంద్రాల వద్ద పక్కాగా 144 సెక్షన్ అమలు



పరీక్ష రాసేందుకు సిద్ధమవుతున్న విద్యార్థులు

శ్రీకాకుళం న్యూకాలనీ:

జిల్లాలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. జిల్లావ్యాప్తంగా 149 పరీక్ష కేంద్రాల్లో ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు విద్యార్థులు పరీక్ష రాశారు. తొలిరోజు ఫస్ట్ లాంగ్వేజ్ పేపర్‌కు రెగ్యులర్, ప్రైవేటు కలిపి జిల్లావ్యాప్తంగా 28,357 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా, 28,140 మంది పరీక్ష రాశారు. వివిధ కారణాలతో 217 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. తొలిరోజు ఎలాంటి మాల్ ప్రాక్టీసు కేసులు నమోదు కాలేదని అధికారులు స్పష్టం చేశారు.

విద్యార్థుల అవస్థలు

పదో తరగతి పరీక్ష కేంద్రాల సమీపంలో పోలీసులు 144 సెక్షన్‌ను పక్కాగా అమలు చేశారు. పరీక్ష కేంద్రాల సమీపంలోకి ఎవరినీ అనుమతించలేదు. విద్యార్థులను సైతం కేంద్రాల్లోకి ప్రవేశించేటప్పుడు నిశితంగా పరిశీలించారు. కొన్ని కేంద్రాల్లో పోలీసులు అతిగా ప్రవర్తించినట్లు తల్లిదండ్రులు ఫిర్యాదులు చేశారు. పరీక్ష కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లను అనుమతించలేదు. అయితే ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించమని అధికారులు స్పష్టం చేయడం, ట్రాఫిక్ కష్టాలు, నిర్దేశిత కేంద్రాలకు బస్సులు సకాలంలో రాకపోవడంతో విద్యార్థులు నానా అవస్థలు పడ్డారు. ఎంపిక చేసిన రూట్లలో బస్సులు తిరగలేదని వాపోయారు. అలాగే కరెంట్ కోతలతో అటు అధికారులు, ఇటు విద్యార్థులకు ఇబ్బందులు తప్పలేదు. గ్రామీణ ప్రాంతాలతో పాటు పట్టణాల్లో సైతం ఉక్కపోతల నడుమ విద్యార్థులు పరీక్షలు రాశారు.

అధికారుల తనిఖీలు విస్తృతం

ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ శ్రీకాకుళం నగరంలోని ఎన్టీఆర్ మున్సిపల్ హైస్కూల్‌ని సందర్శించారు. విద్యార్థులు పరీక్ష రాస్తున్న తీరును పరిశీలించారు. ఫర్నీచర్ ఏర్పాట్లు, తాగునీరు, ఇతర వసతులను పరిశీలించారు. ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి శ్రీకాకుళంలోని గీతాంజలి స్కూల్ కేంద్రాన్ని సందర్శించారు. అక్కడి అధికారులను ఏర్పాట్లపై అడిగి తెలుసుకున్నారు. పోలీసు బందోబస్తుపై పోలీసులకు పలు సూచనలు చేసి, 144 సెక్షన్ పటిష్టంగా అమలు కావాలని దిశానిర్దేశం చేశారు. టెన్త్ పరీక్షల జిల్లా పరిశీలకుడు, ఏపీఈఆర్‌ఈఐఎస్ డైరెక్టర్ వీఎన్ మస్తానయ్య రాగోలు, ఆమదాలవలస, శ్రీకాకుళంలోని పలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఏర్పాట్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. డీఈవో డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య, ఎగ్జామినేషన్స్ అసిస్టెంట్ కమిషనర్ లియాకత్ ఆలీఖాన్‌లు సంయుక్తంగా అంపోలు, గార, కళింగపట్నం కేంద్రాలను తనిఖీ చేశారు. సమగ్ర శిక్ష ఏపీసీ డాక్టర్ సంపతిరావు శశిభూషణ్, ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, సిట్టింగ్ స్క్వాడ్లు, డీవైఈవోలు, ఇతర అధికారులు పరీక్ష కేంద్రాలను చుట్టుముట్టారు. కాగా సీ–సెంటర్లుగా ఉన్న 65 కేంద్రాలపై అధికారులు ప్రత్యేకంగా ఫోకస్ చేశారు. తొలిరోజు విద్యార్థులతో సహా హాజరైన తల్లిదండ్రులు, బంధువులతో పరీక్ష కేంద్రాల వద్ద సందడి వాతావరణం నెలకొంది.



విద్యార్థికి వాటర్ బాటిల్ అందజేస్తున్న తల్లి

'ఓపెన్ స్కూల్' పరీక్షలు ఆరంభం

అలాగే జిల్లాలో సార్వత్రిక విద్యాపీఠం (ఓపెన్ స్కూల్) ద్వారా చేపట్టే టెన్త్ పరీక్షలు సైతం సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఓపెన్ స్కూల్ పరీక్షలు ఉదయం 9 నుంచి 12.30 గంటల నుంచి వరకు జరిగాయి. జిల్లా వ్యాప్తంగా 8 కేంద్రాల్లో జరిగిన ఓపెన్ టెన్త్ పరీక్షలు తొలిరోజు 59 మంది రాయాల్సి ఉండగా, 9 మంది గైర్హాజరయ్యారు. ఇద్దరు ఫ్లయింగ్, 8 మంది సిట్టింగ్ స్క్వాడ్‌లు పరీక్ష కేంద్రాలపై నిఘా పెట్టారు.

ఒక కేంద్రం బదులు.. మరో కేంద్రానికి



పరీక్షా కేంద్రం వద్ద దివ్యాంగ విద్యార్థి ఈశ్వరరావును ఎత్తుకొని ఉన్న తండ్రి

మెళియాపుట్టి: చీపురుపల్లి గ్రామానికి చెందిన దివ్యాంగ విద్యార్థి ఎన్.ఈశ్వరరావు జాడుపల్లి జెడ్పీహెచ్ స్కూల్‌లో పదో తరగతి చదువుతున్నాడు. వాస్తవానికి ఈశ్వరావు చాపర జెడ్పీ స్కూల్‌లో పరీక్ష రాయాల్సి ఉంది. ఆ విషయం అతని తండ్రికి తెలియక సదరు విద్యార్థిని తీసుకొని మెళియాపుట్టి పరీక్ష కేంద్రానికి వెళ్లాడు. అయితే దివ్యాంగ విద్యార్థి తరఫున పరీక్ష రాయాల్సిన యువకుడు (స్క్రైబ్) చాపర సెంటర్ వద్ద నిరీక్షిస్తున్నాడు. సమయం కూడా మించిపోవడంతో అక్కడ ఉన్న సిబ్బంది హాల్ టికెట్ చూసి మళ్లీ చాపర పంపించారు. ఉపాధ్యాయులు అవగాహన కల్పించకపోవడంతోనే ఇబ్బంది పడ్డామని తండ్రి వాపోయారు. అనంతరం విద్యార్థి పరీక్ష రాశాడు.

దేశ భద్రతలో యువత భాగస్వాములవ్వాలి



సైకిళ్లపై ర్యాలీగా వెళ్తున్న సీఐఎస్ఎఫ్ సిబ్బంది

రణస్థలం: దేశ భద్రతలో యువత భాగస్వాములవ్వాలని సీఐఎస్ఎఫ్ జవాన్లు పిలుపునిచ్చారు. సీఐఎస్ఎఫ్ సీనియర్ కమాండెంట్ సతీష్ కుమార్ బాజ్‌పే, డిప్యూటీ కమాండెంట్ వినీత్ కుమార్ ప్రభాకర్‌ల ఆధ్వర్యంలో 80 మంది సభ్యుల సైకిల్ యాత్ర సోమవారం రణస్థలం చేరుకుంది. దీంతో వీరికి తహసీల్దార్ ఎన్.ప్రసాద్, వివిధ పాఠశాలల విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయంలో డిజిటల్ స్క్రీన్‌పై సీఐఎస్ఎఫ్ విధులు, దేశ భద్రతలో పాత్రపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. సీఐఎస్ఎఫ్ ఏర్పాటు చేసి 56 ఏళ్లు పూర్తయిన సందర్భంగా పశ్చిమబెంగాల్‌లోని బకెలి నుంచి ఒక బృందం, గుజరాత్‌లోని లఖపథ్ నుంచి ఒక బృందం సైకిల్ యాత్ర ప్రారంభించామని తెలిపారు. 9 రాష్ట్రాల్లో 25 రోజుల పాటు 6,553 కిలోమీటర్ల సైకిల్ యాత్ర చేపట్టి మార్చి 31న కన్యాకుమారిలో ముగిస్తామన్నారు. మాదక ద్రవ్యాల రవాణా నిషేధం, అక్రమ ఆయుధాల నివారణ, తీరప్రాంత భద్రత, తీవ్రవాదుల చొరబాటు నివారణ, మహిళా సాధికారత కోసం కృషి చేస్తున్నామని వెల్లడించారు. సమృద్ధ్ సంరక్షణ పేరుతో చేపట్టిన సైకిల్ ర్యాలీ ద్వారా ప్రజలను భద్రతా సిబ్బందితో మమేకం చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కమాండెంట్లు ఏకే సింగ్, అమిత్ కుమార్, ఏకే మహాపాత్రో, శిఖార్ లోహియా, శ్రీనివాస్, ఎస్ఐ చిరంజీవి, మహిళ పోలీసు బమ్మిడి అమ్మోజీ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం క్రైమ్: తీరప్రాంత ప్రజలకు అవగాహన కల్పించేందుకు జిల్లాకు విచ్చేసిన సెంట్రల్ ఇండస్ట్రీస్ సెక్యూరిటీ ఫోర్స్ (సీఐఎస్ఎఫ్) సైకిల్ ర్యాలీ సోమవారం ఉదయం విశాఖపట్నానికి బయల్దేరింది. జిల్లా మాజీ సైనిక సంఘ సభ్యులు కొత్తరోడ్డు జంక్షన్ వద్ద జెండా ఊపి ర్యాలీని సాగనంపారు. వీరితో పాటు ట్రాఫిక్ సీఐ నాగరాజు, రూరల్ ఎస్ఐ రాము తదితరులున్నారు.

కాశీబుగ్గలో భారీ చోరీ

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ గాంధీనగర్ ప్రాంతం వివేకానంద కాలనీలో ఆదివారం రాత్రి భారీ దొంగతనం చోటు చేసుకుంది. స్థానికంగా నివాసముంటున్న మెట్ట సుదర్శనరావు, భానుమతి దంపతుల ఇంట్లో ఈ దొంగతనం జరిగింది. ఈనెల 8వ తేదీన కాశీ పుణ్యక్షేత్రం వెళ్లి తిరిగి సోమవారం వచ్చారు. ఇంటికి వచ్చేసరికి ఇంటి తాళాలు పగులగొట్టినట్లు గమనించారు. అనంతరం ఇంట్లోకి వెళ్లి చూడగా దేవుడి గదిలో ఉన్నటువంటి పన్నెండు తులాల బంగారం, ముప్పై తులాల వెండి, రూ.2 లక్షల నగదు చోరీకి గురైనట్లు గుర్తించారు. వెంటనే కాశీబుగ్గ పోలీసులకు తెలియజేయడంతో హుటాహుటిన క్లూస్ టీమ్ చేరుకుని వేలిముద్రలను సేకరించారు. కాశీబుగ్గ సీఐ సూర్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు. కాగా వరుస దొంగతనాలతో పరిసర ప్రాంత ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

ఉత్తరాంధ్ర యాదవులను బీసీ–బీలో చేర్చాలి



శాసన మండలిలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు

కవిటి: శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల పరిధిలో నివసిస్తూ గొల్లలుగా పిలవబడుతున్న యాదవులను ప్రస్తుతం ఉన్న బీసీ–డీ రిజర్వేషన్ కేటగిరీ నుంచి, బీసీ–బీలుగా మార్చాలని ఎమ్మెల్సీ నర్తు రామారావు కోరారు. సోమవారం శాసన మండలిలో ఈ అంశానికి సంబంధించిన విషయాలను ప్రభుత్వానికి నివేదించినట్లు ఆయన తెలిపారు. ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా తీవ్ర వెనుకబాటులో ఉన్నారని, బీసీ కమిషన్ ద్వారా అధ్యయనానికి కమిటీ వేసి సత్వర చర్యలు చేపట్టాలని కోరారు.

పట్టుబడిన పుస్తెలతాడు దొంగ

- మహిళకు లిఫ్ట్ ఇచ్చి బంగారం దోచేసిన కేసు కొలిక్కి



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకటఅప్పారావు, సీఐ సూర్యనారాయణలు

కాశీబుగ్గ: మహిళకు లిఫ్ట్ ఇచ్చి ఆపై బంగారు పుస్తెలతాడు దోచుకున్న కేసులో నిందితుడిని కాశీబుగ్గ పోలీసులు సోమవారం పట్టుకున్నారు. కాశీబుగ్గ డీఎస్పీ వి.వెంకటఅప్పారావు, సీఐ సూర్యనారాయణలు తెలిపిన వివరాల మేరకు.. ఇచ్ఛాపురం మున్సిపాలిటీ పురుషోత్తపురం కాలనీకి చెందిన బంగారుబండి ప్రదీప్ ఈనెల 12వ తేదీన పలాస కిడ్నీ ఆస్పత్రి వద్ద ఆటో కోసం వేచి ఉన్న దుంపల యశోదకు తన ద్విచక్ర వాహనంపై లిఫ్ట్ ఇచ్చాడు. ఆమె కోసంగిపురం కూడలి వద్ద దింపమని కోరుతుండగా సమీపంలోని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లాడు. అక్కడ ఆపి ఆమెను బంగారు పుస్తెలతాడును ఇవ్వమని కత్తితో బెదిరించాడు. కానీ ఆమె ఇవ్వకపోవడంతో తెంచుకొని తన ద్విచక్ర వాహనంపై పారిపోయాడు.

బెట్టింగ్‌లో డబ్బులు పోగొట్టుకొని

విశాఖపట్నంలో ఐటీఐ చదువుకున్న నిందితుడు చదువుమానేసి ఖాళీగా ఇంటివద్ద సెల్‌ఫోన్‌తో కాలం గడుపుతున్నాడు. ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లో అధిక సంపాదనకు ఆశపడి తన తల్లి ఖాతా నుంచి రూ.1.10 లక్షలు పోగొట్టుకున్నాడు. అవి తిరిగి రాకపోవడంతో చేసేదేమీలేక ఎలాగైనా తల్లికి తెలియకుండా డబ్బులు తిరిగి ఖాతాలో వేయాలని ఆలోచించాడు. దీనిలో భాగంగా బంగారం చోరీకి పాల్పడినట్లు ఒప్పుకున్నాడు. చోరీ చేసిన బంగారం పలాస రైల్వే కాలనీలో ఉన్నటువంటి తన బాబాయి రోశవ కిరణ్‌కుమార్ ఇంటికి వెళ్లి అమ్మమని చెప్పాడు. దీంతో సమీపంలోని రెల్లివీధిలో ఉన్న బంగారు వర్తకుడు పవర్ రంజిత్‌కు అమ్మారు. వచ్చిన డబ్బులో తన బాబాయి రూ.27 వేలు ఉంచుకొని, నిందితుడికి రూ.1.50 లక్షలు ఇచ్చాడు. అయితే బెట్టింగ్ యాప్‌లతో పాటు ఇతర ఖర్చులకు డబ్బులు సరిపోవని తన బాబాయి వద్ద రూ.10 వేలు కావాలని అడగడానికి వస్తుండగా, ప్రదీప్‌ను కాశీబుగ్గ పోలీసులు అక్కుపల్లి జంక్షన్ వద్ద స్కూటీ నంబర్ ఏపీ39డీబీ9839 గుర్తించి పట్టుకొని అరెస్టు చేశారు.

రోడ్డు భద్రతపై కఠిన చర్యలు

శ్రీకాకుళం పాతబస్టాండ్:

రోడ్డు భద్రత ఆంక్షలను మరింత కఠినతరం చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో జిల్లా రహదారుల భద్రతా సమన్వయ కమిటీ సమావేశం సోమవారం జరిగింది. ఈ సమావేశానికి కలెక్టర్‌తో పాటు ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డి, కమిటీ మెంబర్ కన్వీనర్ డీటీసీ విజయ సారథి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గడిచిన కొద్దిరోజులుగా జాతీయ రహదారిపై పెద్ద సంఖ్యలో ప్రమాదాలు జరుగుతున్నాయని, పదుల సంఖ్యలో ప్రాణాలు కోల్పోతున్న సంఘటనలు చోటు చేసుకోవడం దురదృష్టకరమని అన్నారు. ఇంజినీరింగ్ శాఖల వారీగా వారి సంబంధిత రహదారులపై తాజాగా జరిగిన ప్రమాదాలను విశ్లేషించి, వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. అతివేగం, డ్రైవింగ్ లైసెన్స్, హెల్మెట్ లేకుండా వాహనం నడపడం, పరిమితికి మించి ఆటోలో ప్రయాణికులను ఎక్కించుకోవడం, బస్సులు ఇతర వాహనాలలో అధిక లోడుతో సరుకు, ఇతర సామగ్రి రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా కేంద్రంలో ఓ నిండు గర్భిణి ఆర్టీసీ బస్సు ఢీకొని చనిపోతే సంబంధిత యూనియన్ లోని కొందరు వ్యక్తులు మానవతా విలువలను మర్చిపోయి వ్యవహరించిన తీరు బాధ కలిగించిందని అన్నారు. జిల్లాలో మత్తు పదార్థాల వినియోగం, విక్రయాలు, రవాణాను అరికట్టేందుకు చిత్తశుద్ధితో పని చేయాలన్నారు.

చిన్నారిపై లైంగిక దాడికి యత్నం

- వృద్ధుడిపై పోక్సో కేసు నమోదు

శ్రీకాకుళం క్రైమ్: చాక్లెట్ ఆశజూపి చిన్నారిపై వృద్ధుడు లైంగిక దాడికి యత్నించిన ఘటన జిల్లా కేంద్రంలోని పుణ్యపు వీధిలో శనివారం చోటుచేసుకుంది. రెండో పట్టణ సీఐ పి.ఈశ్వరరావు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. ఒక అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న వ్యక్తికి భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు. పెద్దపాపకు ఆరేళ్లు ఉండగా, చిన్న పాపకు నాలుగేళ్లు. అయితే ఎదురు అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్న వృద్ధుడు గత కొంతకాలంగా చిన్నారులను మచ్చిక చేస్తూ ఆడించేవాడు. ఎప్పటిలాగే శనివారం కూడా పెద్ద పాపను పిలిచి మాయమాటలు చెప్పి అసభ్యకరరీతిలో తాకే యత్నం చేశాడు. ఇది గమనించిన ఒక మహిళ బాలిక తల్లిదండ్రులకు విషయాన్ని చేరవేయడంతో వృద్ధుడిని అతని భార్య ఎదుటే నిలదీశారు. దీంతో వృద్ధుడు తప్పు అయిపోయిందని కాళ్లావేళ్లా పడ్డాడు. ఇరువైపులా బంధువులు వచ్చి సర్ది చెప్పడంతో ఫిర్యాదు చేయకుండా తల్లిదండ్రులు ఆగిపోయారు. అయితే పాపకు జరిగినట్లు మరొకరికి జరగకూడదనే ఉద్దేశంతో తప్పును ఎలాగైనా బయటపెట్టాలని ఆ భార్యభర్తలు అనుకున్నారు. దీంతో సోమవారం ఉదయం రెండో పట్టణ సీఐ పి.ఈశ్వరరావు, ఎస్ఐ సంతోష్‌కుమార్‌లను ఆశ్రయించారు. వెంటనే పోలీసులు వృద్ధుడిని స్టేషన్‌కు పిలిపించి విచారించారు. అప్పటికే విషయం డీఎస్పీ సీహెచ్ వివేకానంద దృష్టికి వెళ్లడం, చట్టపరంగా చర్యలు తీసుకోమని చెప్పడంతో, చిన్నారి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదు చేశారు.

ప్రభుత్వ సిబ్బందికి కంప్యూటర్ శిక్షణ

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రభుత్వ శాఖల సిబ్బందిని నేటి నుంచి 22 వరకు కంప్యూటర్ శిక్షణ ఇవ్వనున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వెల్లడించారు. సోమవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఆయన మాట్లాడుతూ అన్ని శాఖల నుంచి ఉద్యోగుల జాబితాలను సిద్ధం చేసి సత్వరమే అందజేయాలన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, పవర్ పాయింట్ ప్రజెంటేషన్, ఎక్సెల్ షీట్, అడ్వాన్స్ టూల్‌పై శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. 18, 19 తేదీల్లో కలెక్టరేట్ కార్యాలయ సిబ్బందికి, జిల్లా కేంద్రంలో ఉన్న ఆయా శాఖల సిబ్బందికి కలిపి 100 మంది ఉద్యోగులకు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కంప్యూటర్ శిక్షణ ఉంటుందని తెలిపారు. మార్చి 20వ తేదీన టెక్కలి డివిజన్ కేంద్రంలో 40 మందికి, మార్చి 21న పలాస డివిజన్ కేంద్రంలో 30 మందికి, మార్చి 22న శ్రీకాకుళం డివిజన్ కేంద్రంలో 30 మంది ఉద్యోగులకు శిక్షణ ఉంటుందని ఆయన వివరించారు.

సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పరిధిలోని 14 బీఈడీ కళాశాలల మూడో సెమిస్టర్ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. జిల్లాలోని బీఆర్ఏయూ, శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, టెక్కలి, పలాస, పాలకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు, రాజాంలోని జీసీఎస్ఆర్ ప్రైవేట్ డిగ్రీ కళాశాలల్లో పరీక్షలు జరుగుతున్నాయి. 1220 మంది విద్యార్థులు పరీక్ష రాస్తున్నారు. ఈనెల 21వ తేదీ వరకు పరీక్షలు జరగనున్నాయి. వర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.అనురాధ వర్సిటీ పరీక్ష కేంద్రాన్ని పరిశీలించారు.

మొదలైన ఇంటర్ స్పాట్

శ్రీకాకుళం న్యూకాలనీ: ఇంటర్మీడియెట్ స్పాట్ వాల్యుయేషన్ సోమవారం ప్రారంభమైంది. శ్రీకాకుళం ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల వేదికగా సోమవారం మొదటివిడత సబ్జెక్టుల జవాబుపత్రాల దిద్దుబాటు ప్రక్రియ మొదలైంది. జవాబుపత్రాల దిద్దుబాటులో సీఈలు, ఏఈలు అప్రమత్తంగా వ్యవహరించాలని, ముఖ్యంగా సమయపాలన కచ్చితంగా పాటించాలని ఆర్ఐఓ/జిల్లా స్పాట్ క్యాంప్ ఆఫీసర్ ప్రగడ దుర్గారావు పేర్కొన్నారు. ఇంటర్మీడియెట్ బోర్డు అపాయింట్‌మెంట్ ఆర్డర్ వచ్చిన ప్రతి ఒక్కరు స్పాట్ కేంద్రం వద్ద విధిగా రిపోర్ట్ చేయాలని ఆర్ఐఓ పి.దుర్గారావు స్పష్టంచేశారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి




అశోక్‌కుమార్ మృతదేహం

సోంపేట: మండలంలోని బారువ రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తు తెలియని రైలు ఢీకొని బారువ గ్రామానికి చెందిన నెయ్యిల అశోక్ కుమార్ (43) సోమవారం మృతి చెందాడు. రైల్వేలైన్ దాటుతుండగా ప్రమాదం జరిగి ఉండవచ్చునని రైల్వే పోలీసులు భావిస్తున్నారు. మృతుడికి భార్య వసంత, కుమారుడు, కుమార్తె ఉన్నారు. అశోక్ కుమార్ కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరు అయ్యారు.

ఆదిత్యాలయంలో అక్రమ వ్యవహారాలపై విచారణ

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో ఇటీవల కాలంలో 'సాక్షి'తో పాటు పలు పత్రికల్లో వచ్చిన పలు కథనాలపై జిల్లా ఉన్నతాధికారులు స్పందించారు. ఈమేరకు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ ఆదేశాల మేరకు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లావణ్య సోమవారం సాయంత్రం అరసవల్లిలో అధికారులతో చర్చించి అక్రమ వ్యవహారాల అంశాల వారీగా వివరాలను సేకరించారు. అభియోగాలు ఎదుర్కొంటున్న ఆలయానికి చెందిన పలువురు దినసరి వేతనదారులతో పాటు ఇతర ఉద్యోగుల నుంచి లిఖిత పూర్వకంగా స్టేట్‌మెంట్స్ రికార్డు చేశారు. రిటైర్డ్ ఈఓ జగన్మోహనరావుపై వస్తున్న అనేక అవినీతి ఆరోపణలపై కూడా ఆరా తీశారు. రథసప్తమి నాడు నిబంధనలకు విరుద్ధంగా వీఐపీ టిక్కెట్ల విక్రయాలు చేశాడన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న కంప్యూటర్ ఆపరేటర్ యుగంధర్ నుంచి కూడా స్టేట్‌మెంట్ తీసుకున్నారు. అలాగే అన్నదాన ప్రసాదాల కౌంటర్ల నిర్వహణలో ఇబ్బందులు, భక్తులు ఎదుర్కొంటున్న సమస్యలపై కూడా విచారణ చేశారు.

నేడు ఎస్‌బీఐ పెన్షనర్స్ సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న అధ్యక్షుడు రామచంద్రరావు

శ్రీకాకుళం అర్బన్: ఎస్‌బీఐ పెన్షనర్స్ అసోసియేషన్ అమరావతి సర్కిల్ నాలుగో సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు కె.రామచంద్రరావు తెలిపారు. నగరంలోని సన్‌రైజ్ హోటల్‌లో ఎస్‌బీఐ పెన్షనర్స్ అసోసియేషన్ అమరావతి సర్కిల్ ఎగ్జిక్యూటివ్ కమిటీ మీటింగ్ సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2017లో స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియాను రెండు విభాగాలుగా ఎస్‌బీఐ ఇండియా, ఎస్‌బీఐ హైదరాబాద్, అమరావతి సర్కిల్స్‌గా విభజించారన్నారు. 2022లో గుంటూరులో ఎస్‌బీఐ పెన్షనర్స్ అసోసియేషన్ అమరావతి సర్కిల్ ఏర్పడిందన్నారు. ఇప్పటివరకు రాష్ట్రంలో మూడుచోట్ల సర్వసభ్య సమావేశం నిర్వహించామని, నాలుగో సర్వసభ్య సమావేశం శ్రీకాకుళంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 10,500 మందితో పెన్షనర్స్ అసోసియేషన్ అమరావతి సర్కిల్ అతిపెద్ద సభ్యత్వం కలిగిన పెన్షనర్స్ యూనియన్‌గా దేశంలోనే నంబర్ వన్ అసోసియేషన్‌గా ఉందని వివరించారు. ఎస్‌బీఐ విశ్రాంత ఉద్యోగులకు అత్యధిక పెన్షన్ అందుతుందని అనుకోవడం అపోహ మాత్రమేనని వెల్లడించారు. ఏ ద్వైపాక్షికంలో రిటైర్ అయితే ఆవిధంగానే పెన్షన్ అందజేస్తున్నారని తెలిపారు. ఈనెల 24, 25 తేదీల్లో చేపట్టనున్న బ్యాంకు ఉద్యోగుల సమ్మెకు తాము సంఘీభావం తెలుపుతున్నామని పేర్కొన్నారు. విశ్రాంత ఎస్‌బీఐ పెన్షనర్స్ తరఫున రెడ్‌క్రాస్ సంస్థకు ఫ్రిజ్‌ను అందజేయడం జరిగిందని, అదేవిధంగా ప్రశాంతి వృద్ధాశ్రమంలో ఎనిమిది మంచాలను అందించినట్లు వివరించారు. గత ఐదేళ్లలో పెన్షనర్లకు లైఫ్ సర్టిఫికెట్లు చేయడంలో శ్రీకాకుళం నంబర్ వన్‌గా నిలిచిందని చెప్పారు. కార్యక్రమంలో అసోసియేషన్ జనరల్ సెక్రటరీ పీఏస్వీఎస్ శర్మ, డీజీఎస్‌సీహెచ్ వెంకటేశ్వరరావు, సర్కిల్ ఉపాధ్యక్షుడు బాపయ్య పంతులు, ఏజీఎస్ శశిభూషణ్ రాజు, చైర్మన్ కోటేశ్వరరావు, వీఎస్పీ బ్రహ్మ తదితరులు పాల్గొన్నారు.